# బలగం TV BALAGAM

నిజమే మా బలం.. ప్రజలే మా బలగం

BALAGAM TV DIGITAL NEWS PAPER | balagamtv100@gmail.com

హైదరాబాద్ శుక్రవారం 02 ఆగస్టు 2024 | www.balagamtv.com | పేజీలు 4


## వయనాడ్‌లో ఎంపీ రాహుల్ పర్యటన

- చూర్‌మలాలో పర్యటించిన రాహుల్ గాంధీ

**బలగం టీవి, న్యూఢిల్లీ బ్యూరో**

కేరళలోని వయనాడ్‌లో కొండచరియలు విరిగిపడ్డ ఘటనలో మృతిచెందిన వారి సంఖ్య 288కి చేరుకున్నది. అయితే ప్రమాదానికి కేంద్ర స్థానమైన చూర్‌మలాలో ఇవాళ రాహుల్ గాంధీ, ప్రియాంకా గాంధీలు పర్యటించారు. అక్కడ బాధిత కుటుంబాలను పరామర్శించారు. మెప్పాడిలో కమ్యూనిటీ హెల్త్ సెంటర్‌లో బాధితులను కలుసుకున్నారు. అక్కడ నుంచి డాక్టర్ మూపెన్స్ మెడికల్ కాలేజీకి వెళ్తున్నారు. మెప్పాడీలో రెండు రిలీఫ్ క్యాంప్‌లు ఉన్నాయి. రాహుల్, ప్రియాంకాలతో పాటు ఏఐసీసీ ప్రధాన కార్యదర్శి ఎంపీ కేసీ వేణుగోపాల్ కూడా ఉన్నారు. ఉదయం 9.30 నిమిషాలకు కన్నూర్ విమానాశ్రయంలో రాహుల్, ప్రియాంకాలు దిగారు. రోడ్డు మార్గం ద్వారా వయనాడ్ వెళ్లారు.

వయనాడ్‌ను అతలాకుతలం చేసిన కొండచరియలు విరిగిపడిన దుర్ఘటనలను జాతీయ విపత్తుగా లోక్‌సభలో ప్రతిపక్ష నాయకుడు రాహుల్ గాంధీ అభివర్ణించారుఈ ఘోర దుర్ఘటనలో కుటుంబ సభ్యులను, ఇళ్లను కోల్పోయిన వారి ఆవేదన వర్ణాతీతమని ఆయన అన్నారు. గురువారం తన సోదరి ప్రియాంక గాంధీ వాద్రతో

మిగితా 3వ పేజీలో



## ఎస్సీ వర్గీకరణ అందరికంటే ముందే తెలంగాణలో అమలు చేస్తాం

- సీఎం రేవంత్ రెడ్డి

**బలగం టీవి, హైదరాబాద్ బ్యూరో**

ఎస్‌సి వర్గీకరణ కోసం మాదిగ, మాదిగ ఉపకులాల యువకులు 27 ఏళ్ళుగా పోరాటం చేశారని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తెలిపారు. గతంలో మాదిగ, మాదిగ ఉపకులాల వర్గీకరణ కోసం తాను, సంపత్ వాయిదా తీర్మానం కూడా ఇచ్చామని, వాయిదా తీర్మానాన్ని ఇచ్చిన మమ్మల్ని సభ నుంచి బహిష్కరించారని గుర్తు చేశారు. సుప్రీంకోర్టు ఎస్‌సి వర్గీకరణకు అనుకూలంగా తీర్పు ఇచ్చిన నేపథ్యంలో శాసన సభలో రేవంత్ రెడ్డి ప్రసంగించారు. గత ప్రభుత్వం ఎస్‌సి వర్గీకరణ అంశంపై ప్రధాని నరేంద్ర మోడీ వద్దకు అఖిలపక్షం తీసుకెళ్తామని చెప్పిందని, కానీ కేంద్రం వద్దకు అఖిలపక్షాన్ని తీసుకుపోకుండా మోసం చేసిందని దుయ్యబట్టారు. సుప్రీంకోర్టులో ఎస్‌సి వర్గీకరణ కోసం తెలంగాణ ప్రభుత్వం బలమైన వాదనలు వినిపించిందన్నారు. ఎస్‌సి వర్గీకరణకు సుప్రీంకోర్టు అనుకూలంగా తీర్పు ఇచ్చిందని ప్రశంసించారు. సుప్రీంకోర్టు రాజ్యాంగ ధర్మాసనానికి రేవంత్ రెడ్డి ప్రత్యేకంగా ధన్యవాదాలు తెలిపారు. దేశంలోనే అందరికంటే ముందే ఎస్‌సి వర్గీకరణను తెలంగాణలో అమలు చేస్తామని, ఇప్పుడిచ్చిన నోటిఫికేషన్లలో వర్గీకరణ అమలు చేస్తామన్నారు. ఇప్పుడిచ్చిన నోటిఫికేషన్లలో ఆర్డినెన్స్ తీసుకువచ్చి మాదిగ సోదరులకు న్యాయం చేయడంతో పాటు ఎస్‌సి వర్గీకరణకు సంపూర్ణంగా సహకరించాలని సభను కోరుతున్నామని రేవంత్ రెడ్డి చెప్పారు.

# ఎస్సీ సుప్రీం గ్రీన్ సిగ్నల్

## ఏ, బీ, సీ, డీ

- రాష్ట్రాలు వర్గీకరించుకోవచ్చని సుప్రీంకోర్టు తీర్పు
- 6:1 మాజార్టీతో ఆమోదం
- 2004 తీర్పును కొట్టేసిన కోర్టు
- ఏండ్ల తరబడి నిరీక్షణకు తెర



**బలగం టీవి, న్యూఢిల్లీ బ్యూరో**

ఎస్సీ, ఎస్టీ వర్గీకరణకు లైన్‌క్లియరైంది. రిజర్వేషన్లలో వర్గీకరణకు సుప్రీం కోర్టు అనుమతి ఇచ్చింది. ఏడుగురు సభ్యుల ధర్మాసనం ఈ కీలక తీర్పును వెలువరించింది. చీఫ్ జస్టిస్ డీవై చంద్రచూడ్‌తో పాటు జస్టిస్ బీఆర్ గవాయి, విక్రమ్ నాథ్, బేలా ఎం త్రివేది, పంకజ్ మిథల్, మనోజ్ మిశ్రా, సతీష్ చంద్ర శర్మ ఆ ధర్మాసనంలో ఉన్నారు. 2005లో ఇచ్చిన ఈవీ చెన్నయ్య వర్సెస్ ఏపీ ప్రభుత్వం కేసును కోర్టు కొట్టివేసింది. రాజ్యాంగంలోని ఆర్టికల్ 341కు వ్యతిరేకంగా వర్గీకరణ ఉన్నట్లు ఆ నాటి తీర్పులో సుప్రీం తెలిపింది. అయితే ఇవాళ ఏడుగురు సభ్యుల ధర్మాసనం ఆ తీర్పును తోసిపుచ్చింది.6-1 తేడాతో ఇచ్చిన మెజార్టీ తీర్పులో స్పష్టం చేసింది. ఈ ధర్మాసనంలో జస్టిస్ బిఆర్ గవారు, జస్టిస్ విక్రమ్ నాథ్, జస్టిస్ బేలా ఎం త్రివేది, జస్టిస్ పంకజ్ మిట్టల్, జస్టిస్ మనోజ్ మిశ్రా, జస్టిస్ సతీష్ చంద్ర శర్మ ఉన్నారు. వీరిలో జస్టిస్ బేలా త్రివేది మెజార్టీ తీర్పుతో విభేధించారు.

2005లో ఇ వి చిన్నయ్య వర్సెస్ ఆంధ్రప్రదేశ్ కేసులో ఐదుగురు సభ్యులు ఇచ్చిన తీర్పును పక్కన పెట్టింది. ఎస్సీల్లో ఉప వర్గీకరణ అనుమతించబడదని ఆనాడు సుప్రీం ధర్మాసనం తీర్పు చెప్పింది. ఏడుగురు న్యాయ మూర్తుల రాజ్యాంగ ధర్మాసనం ప్రధానంగా రెండు అంశాల ను పరిగణనలోకి తీసుకుని ఈ తీర్పు వెలువరించింది. ఒకటి, ఎస్సీ రిజర్వేషన్లలో సబ్ కోటా అనుమతించబడుతుందా? రెండవది ఇ వి చిన్నయ్య వర్సెస్ ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్రం (2005) కేసులో తీర్పు సరైనదా? కాదా? వీటిపై విచారించిన రాజ్యాంగ ధర్మాసనం విచారణ అనంతరం ఈ ఏడాది ఫిబ్రవరి 8న తీర్పును రిజర్వులో ఉంచి , ఇప్పుడు వెల్లడించింది. షెడ్యూల్డ్ కులాలు సజాతీయ తరగతి కాదని, వీరిలో అత్యంత వెనుకబడినవారికి ప్రయోజనాలు చేకూరేందుకు వారి జీవితం మెరుగుపడేందుకు సబ్ కోటాను అనుమతించవచ్చని చెప్పింది. షెడ్యూల్డ్ కులాల్లో సమానత్వ సాధనకు ఇదొక మార్గమని తెలిపింది.

ఎస్సీల్లో వివిధ సెక్షన్ల ప్రాతినిధ్యం తక్కువగా ఉందని అనుభవ పూర్వక సాక్ష్యాలున్నాయని, వాటి ఆధారంగానే రిజర్వేషన్లలో రిజర్వేషన్లు ఉండాల్సిన అవసరముందని తాము అభిప్రాయపడుతున్నామని రాజ్యాంగ ధర్మాసనం వివరించింది. ఎస్సీల్లో సబ్ కోటా రాజ్యాంగంలోని ఆర్టికల్ 14 (సమానత్వం)ను ఉల్లంఘించదు. కులాన్ని ఉప వర్గీకరించేందుకు నిరోధించేది ఏదీ ఆర్టికల్ 15, 16లో లేదు. అందుకే 2005 నాటి ఇ వి చిన్నయ్య తీర్పును మేం వ్యతిరేకిస్తున్నామని ధర్మాసనం తెలిపింది. . . రాష్ట్రాలు ఉప వర్గీకరణ చేసుకునేందుకు అనుమతి ఇస్తున్నాం. అయితే, ఇందుకు సంబంధించి మార్గదర్శకాలను నిర్దిష్టంగా రూపొందించాలని కోర్టు సూచించింది. మధ్యప్రదేశ్‌లో 25 కులాల్లో తొమ్మిది మాత్రమే షెడ్యూల్ కులాలు. కాబట్టి రాష్ట్రాలు వివక్ష, వెనుకబాటుతనం విభిన్న స్థాయిలను పరిగణనలోకి తీసుకుని . షెడ్యూల్డు కులాల్లో బాగా వెనుకబడిన సెక్షన్లకు ప్రయోజనం చేకూరేలా చూడాలి. ఇది ఎస్‌సి, ఎస్‌టిల ఉప వర్గీకరణ చేసే హక్కు రాష్ట్రపతికి కల్పించే ఆర్టికల్ 341 (2)ను ఉల్లంఘించదు. రాష్ట్రపతి నోటిపై చేసిన షెడ్యూల్ కులాలు భిన్నమైన వర్గాలనే చారిత్రక ఆధారాలను నిర్ధారించాం.

అసమానుల మధ్య సమానత్వం అన్న అంశంపై న్యాయస్థానం కేంద్రీకరించిందని జస్టిస్ బిఆర్ గవాయ్ పేర్కొన్నారు. సంపన్న వెనుకబడిన తరగతులకు కోటా ప్రయోజనాలను కొనసాగించడం రిజర్వేషన్ ఉద్దేశ్యాన్నే దెబ్బతీస్తుందని అన్నారు. ఎస్‌సిల్లో కూడా క్రీమీలేయర్‌ను గుర్తించే విధానాన్ని రాష్ట్రాలు రూపొందించాలని జస్టిస్ గవాయ్ తన అభిప్రాయాన్ని వెల్లడించారు. రిజర్వేషన్లు ఒక కుటుంబంలో ఒక తరానికి మాత్రమే పరిమితం చేయాలని, కోటా ప్రయోజనాలను ఏ తరం అయినా సద్వినియోగం చేసుకుంటే, తరువాత తరానికి రిజర్వేషన్లు అందుబాటులోకి రాకూడదని ప్రతిపాదించారు.

రాజ్యాంగ ధర్మాసనంలోని జస్టిస్ బేలా ఎం.త్రివేది భిన్నాభిప్రాయాన్ని వ్యక్తం చేశారు. ఎస్‌సి, ఉప కులాల వర్గీకరణను రాజ్యాంగ ధర్మాసనంలోని మెజారిటీ సభ్యులు సమర్థించగా.. జస్టిస్ బేలా త్రివేది మాత్రం వ్యతిరేకించారు. ఉప వర్గీకరణ అనుమతిం చకూడదని పేర్కొన్నారు. ఎస్‌సిల్లోనికొన్ని వర్గాలను మాత్రమే గుర్తించి, వారికి ప్రాధాన్యత కోటాను ఇవ్వడంతో రాష్ట్రాలు ఎస్‌సి కులాల జాబితాను చేయలేవని పేర్కొన్నారు. కోటా మొత్తం ఎస్‌సి వర్గానికి సంబంధించినదని తెలిపింది. రాజకీయ కారణాలతో ఎస్‌సి జాబితాను చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వానికి అధికారం లేదని పేర్కొన్నారు.

ప్రభుత్వ ఉద్యోగాల్లో ఎస్‌సి కోటా రిజర్వేషన్లలో 50 శాతాన్ని వాల్మీకి, మజహబీ సిక్కు సామాజిక వర్గాలకు తొలి ప్రాధాన్యంగా ఇస్తూ 2006లో పంజాబ్ ప్రభుత్వం చట్టం చేసింది. ఎస్‌సి రిజర్వేషన్ల ఉప వర్గీకరణ చెల్లదంటూ పంజాబ్, హర్యానా హైకోర్టు 2010లో తీర్పు ఇచ్చింది. 2004లో ఇవి చిన్నయ్య వర్సెస్ ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం కేసులో సుప్రీం కోర్టు రాజ్యాంగం ధర్మాసనం ఇచ్చిన తీర్పును ఉల్లంఘించేలా పంజాబ్ రాష్ట్ర ప్రభుత్వం చట్టం ఉందని హైకోర్టు పేర్కొంది. ఎస్‌సి కులాల జాబితాలో సామాజిక వర్గాన్ని చేర్చాలన్నా, తొలగించాలన్నా పార్లమెంట్‌కు మాత్రమే అధికారం ఉందని, రాష్ట్రాల అసెంబ్లీలకు లేదని 2004లో తీర్పు చెప్పింది. ఆ తీర్పునే హర్యానా, పంజాబ్ హైకోర్టు ఉత్తర్వుల్లో పేర్కొంది. పంజాబ్, హర్యానా హైకోర్టు ఇచ్చిన తీర్పును సవాలు చేస్తూ పంజాబ్ ప్రభుత్వం దాఖలు చేసిన

మిగితా 3వ పేజీలో



## సుప్రీంకోర్టు తీర్పును స్వాగతిస్తున్నాం

- మాజీ మంత్రి, ఎమ్మెల్యే కేటీఆర్

**బలగం టీవి, హైదరాబాద్ బ్యూరో**

కేటీఆర్ ఎస్సీ వర్గీకరణకు అనుకూలంగా సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పును బీఆర్ఎస్ స్వాగతిస్తోందని ఆ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ అన్నారు. ఎస్సీ వర్గీకరణ కోసం మాదిగలు చేసిన పోరాట విజయమిదని చెప్పారు. మొదటి నుంచి ఎస్సీ వర్గీకరణకు బీఆర్ఎస్ చిత్తశుద్ధితో కృషి చేసిందని తెలిపారు. ఈ అంశంపై మిగతా రాజకీయ పార్టీలన్నీ ఓట్ల రాజకీయం చేశాయని కేటీఆర్ గుర్తు చేశారు. ఒకే పార్టీలో వర్గీకరణకు మద్దతుగా ఒక వర్గం.. వ్యతిరేకంగా ఓ వర్గం వాదనలు వినిపిస్తూ ఎస్సీలను మోసం చేశాయని ఆవేదన వ్యక్తం చేశారు. బీఆర్ఎస్ మాత్రమే ఎస్సీ వర్గీకరణలో మిగతా పార్టీల మాదిరిగా ఒకే పార్టీలో మేము రెండు వాదనలు వినిపించలేదన్నారు. ఒక్క కేసీఆర్ మాత్రమే ఈ అంశాన్ని రాజకీయకోణంలో కాకుండా సామాజిక న్యాయ కోణంలో ఆలోచించారన్నారు. తెలంగాణ డిమాండ్ ఎంత న్యాయమైనదో.. ఎస్సీ వర్గీకరణ కూడా అంతే న్యాయమైన డిమాండ్ అని కేసీఆర్ గారు భావించారని చెప్పారు. అందుకే రాష్ట్రంలో బీఆర్ఎస్ అధికారంలోకి రాగానే అసెంబ్లీలో ఎస్సీ వర్గీకరణపై తీర్మానం చేసిన సంగతిని గుర్తు చేశారు. స్వయంగా సీఎం హెూదా లో కేసీఆర్ గారు ఢిల్లీ వెళ్లి ప్రధాని మోడీకి ఎస్సీ వర్గీకరణ చేయాలంటూ లేఖ ఇచ్చారన్నారు. ఎస్సీ వర్గీకరణ నా బాధ్యత అని కూడా కేసీఆర్ గారు చెప్పిన విషయాన్ని కేటీఆర్ ప్రస్తావించారు. అంతేకాకుండా ఎస్సీ వర్గీకరణకు సంబంధించి రాష్ట్రాలకే అధికారం ఇవ్వాలని కూడా కేసీఆర్ గారు గతంలో కోరారన్నారు. ఇప్పుడు గౌరవ సుప్రీంకోర్టు కూడా ఇదే అంశాన్ని స్పష్టం చేసిందని చెప్పారు.

ఎస్సీ లకు సంబంధించిన ఉప కులాల జనాభా ఒక్కో రాష్ట్రంలో ఒక్కో విధంగా ఉంటుంది. దానికి అనుగుణంగా ఎస్సీ వర్గీకరణ చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వాలకు అధికారం కల్పించటం శుభపరిణామన్నారు. సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పు ఆధారంగా రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం వెంటనే వర్గీకరణ ప్రక్రియ ను ప్రారంభించాలని కేటీఆర్ డిమాండ్ చేశారు. బీఆర్ఎస్ తరపున ప్రభుత్వానికి మా సహకారం ఉంటుందన్నారు.

## కొత్త రేషన్ కార్డుల కోసం సబ్ కమిటీ



- జీహెచ్ఎంసీలో ఔటర్ గ్రామాల వీలనానికి సైతం సబ్ కమిటీ
- క్యాబినెట్‌లో పలు కీలక నిర్ణయాలు

**బలగం టీవి, హైదరాబాద్ బ్యూరో**

రాష్ట్రంలో కొత్త రేషన్ కార్డుల కోసం క్యాబినెట్ సబ్ కమిటీ ఏర్పాటు చేయాలని నిర్ణయించారు. గురువారం తెలంగాణ మంత్రివర్గ సమావేశంలో పలు కీలక నిర్ణయాలు తీసుకున్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అధ్యక్షతన దాదాపు 2 గంటల పాటు సుదీర్ఘంగా జరిగిన భేటీలో కీలక . కొత్త రేషన్ కార్డుల జారీకి సంబంధించిన విధి విధానాలపై ప్రధానంగా చర్చించి రేషన్ కార్డుల కోసం కేబినెట్ సబ్ కమిటీ ఏర్పాటుకు నిర్ణయించారు. మంత్రి ఉత్తమ్ అధ్యక్షతన ఏర్పాటు కానున్న ఈ సబ్ కమిటీ రేషన్ కార్డుల జారీకి సంబంధించి విధి విధానాలను రూపొందించనుంది. ఈ క్రమంలోనే రేషన్ కార్డు, ఆరోగ్యశ్రీ కార్డులు విడిగా

మిగితా 3వ పేజీలో

### నిర్ణయాలు ఇవే..

హుస్నాబాద్ నియోజకవర్గంలోని గౌరవెల్లి ప్రాజెక్ట్ పూర్తి

నిఖత్ జరీన్, సిరాజ్‌లకు ఇళ్ల స్థలాలు, ప్రభుత్వ ఉద్యోగం

జీహెచ్ఎంసీలో ఔటర్ గ్రామాల విలీనానికి కేబినెట్ సబ్ కమిటీ ఏర్పాటు

ఈ కమిటీలో సభ్యులుగా మంత్రులు పొన్నం ప్రభాకర్, సీతక్క, శ్రీధర్ బాబు

కొత్త రేషన్ కార్డులకు కేబినెట్ ఆమోదం

విధివిధానాల ఖరారుకు మంత్రి ఉత్తమ్ అధ్యక్షతన కమిటీ.. సభ్యులుగా పొంగులేటి, దామోదర రాజనర్సింహ

నేడు సభలో జాబ్ క్యాలెండర్‌ను విడుదల

నిజాం షుగర్ ఫ్యాక్టరీ తిరిగి ప్రారంభించాలని నిర్ణయం

గవర్నర్ కోటాలో కోదండరాం, అమీర్ అలీఖాన్‌లను ఎమ్మెల్సీలుగా నియమించేందుకు గవర్నర్‌కి రికమండ్ చేయాలని నిర్ణయం

మూసీలో ఎప్పటికీ ఫ్రెష్ వాటర్ ఉండేందుకు తగు నిర్ణయాలు తీసుకున్న కేబినెట్

## నీట్ పేపర్ లీక్ కేసులో మొదటి ఛార్జిషీట్




**బలగం టీవి, న్యూఢిల్లీ బ్యూరో**

నీట్ యూజీ పరీక్ష 2024 పేపర్ లీక్ కేసులో 13 మందిని నిందితులుగా పేర్కొంటూ సీబీఐ తొలి చార్జిషీట్‌ను దాఖలు చేసింది. ఈ మేరకు అధికారులు గురువారం తెలిపారు. నిందితులు పేపర్ లీక్ సహా ఇతర అక్రమాలకు పాల్పడ్డారని ఛార్జ్‌షీట్‌లో పేర్కొన్నారు. కాగా, ఈ విషయంలో ఇంకా దర్యాప్తు కొనసాగుతోందని తెలిపారు.నితీశ్ కుమార్, అమిత్ ఆనంద్, సికిందర్ యాద్వెందు, అశుతోష్ కుమార్-1, రోషన్ కుమార్, మనీశ్ ప్రకాష్, అశుతోష్ కుమార్-2, అఖిలేష్ కుమార్, అవదేశ్ కుమార్, అనురాగ్ యాదవ్, అభిషేక్ కుమార్, శివానందన్ కుమార్, ఆయుష్ రాజ్?పై అభియోగాలు మోపామని సీబీఐ తెలిపింది. ఈ కేసులో బిహార్? పోలీసులు అరెస్టు చేసిన 15మందితో సహా ఇప్పటివరకు 40 మంది నిందితులను అరెస్టు చేసినట్లు పేర్కొంది. 58 ప్రాంతాల్లో సోదాలు నిర్వహించినట్లు వెల్లడించింది.

## బీఆర్ఎస్ ఎమ్మెల్యేల అరెస్ట్..



**బలగం టీవి, హైదరాబాద్ బ్యూరో**

అసెంబ్లీ సాక్షిగా బీఆర్ఎస్ పార్టీకి చెందిన మహిళా ఎమ్మెల్యేలపై ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి చేసిన వ్యాఖ్యలను నిరసిస్తూ అసెంబ్లీ ఆవరణలో బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు నిరసన వ్యక్తం చేశారు. సీఎం ఛాంబర్ ఎదుట ధర్నా చేసిన బీఆర్ఎస్ ఎమ్మెల్యేలను అరెస్టు చేశారు. మహిళలను అవమానపరిచన సీఎం రేవంత్ వెంటనే క్షమాపణలు చెప్పాలని డిమాండ్ చేశారు. నల్ల బ్యాడ్జీలతో అసెంబ్లీలో వెల్‌లో బైఠాయించగా.. మర్షల్ వారిని అసెంబ్లీ వెలుపలకు తీసుకువచ్చారు. అనంతరం పోలీసులు వాహనంలో అసెంబ్లీ నుంచి తరలించారు. బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్, మాజీ మంత్రులు హరీశ్‌రావు, ప్రశాంత్‌రెడ్డి, జగదీశ్‌రెడ్డి, గంగుల కమలాకర్, పద్మారావు గౌడ్‌తో పాటు ఎమ్మెల్యేలు పాడి కౌశిక్‌రెడ్డి, అనిల్ జాదవ్, పల్లా రాజేశ్వర్‌రెడ్డితో పాటు పలువురి సభ్యులను అరెస్టు చేశారు.

ఈ సందర్భంగా హరీశ్‌రావు మాట్లాడుతూ.. శాసనసభలో విపక్షం గొంతునొక్కారన్నారు. ఎన్నిసార్లు కోరినా స్పీకర్ మైక్ ఇవ్వడం లేదని ఆరోపించారు. తెలంగాణ ఉద్యమంలో కూడా ఇన్ని ఆంక్షలు లేవని, తెలం గాణ ఉద్యమంలో లేని ఆంక్షలు శాసనసభలో చూడడం దురదృష్టకరమన్నారు. ఇవాళ ప్రజాస్వామ్యం ఖూనీ అయిపోయిందన్నారు. ముమ్మాటికి ఈ ముఖ్యమంత్రి తెలంగాణ ఆడబిడ్డలకు క్షమాపణలు చెప్పాల్సిందేనని.. అప్పటి వరకు విడిచిపెట్టేది లేదని కేటీఆర్ స్పష్టం చేశారు. ఈ సందర్భంగా సీఎం డౌన్ డౌన్ అంటూ కేటీఆర్ నినదించారు. మరోవైపు శాసనసభలో మూడుగంటలుగా నిల్చొని ఎమ్మెల్యేలు


మిగితా 3వ పేజీలో

## శ్రీశైలం ప్రాజెక్టు 10 గేట్లు ఎత్తివేత

**బలగం టీవి, హైదరాబాద్ బ్యూరో**

ఎగువ ప్రాంతాల నుంచి శ్రీశైలం జలాశయానికి వరద భారీగా పెరుగుతున్నది. గంట గంటకు వరద ఉధృతి మరింత పెరుగుతూ వస్తున్నది. ప్రస్తుతం ప్రాజెక్టు పది గేట్లను 15 అడుగుల వరకు ఎత్తి 3,76,670 క్యూసెక్కుల నీటిని అధికారులు దిగువకు వదులుతున్నారు. దాంతో వరద నాగార్జున సాగర్ వైపు వెళ్తున్నది. జూరాలా, సుంకేశుల జలాశయాల నుంచి డ్యామ్‌కు ఇన్‌ఫ్లో కొనసాగుతున్నది. శ్రీశైలం జలాశయానికి ప్రస్తుతం 3,95,162 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో ఉండగా.. అవుట్ ఫ్లో 4,36,902 క్యూసెక్కులుగా నమోదైంది.

ప్రాజెక్టు పూర్తిస్థాయి నీటిమట్టం 885 అడుగులు కాగా.. ప్రస్తుత నీటిమట్టం 884.40 అడుగులుగా ఉన్నది. జలాశయం పూర్తిస్థాయి నీటి సామర్థ్యం 215.807 టీఎంసీలు.. ప్రస్తుతం జలాశయంలో 212.4385 టీఎంసీల నీటి నిల్వ ఉన్నది. కుడి, ఎడమగట్టులోని జల విద్యుత్ ఉత్పత్తి కేంద్రాల్లో కరెంటు ఉత్పత్తి కొనసాగుతున్నది. మరో వైపు ప్రాజెక్టు గేట్లు ఎత్తడంతో శ్రీశైలం పరిసరాలన్నీ పర్యాటకులతో కిక్కిరిసిపోతున్నాయి. డ్యామ్ అందాలను చూసేందుకు పర్యాటకులు భారీగా తరలివస్తున్నారు. దాంతో ఘాట్ రోడ్లన్నీ వాహనాలతో నిండిపోయాయి.






## నాలుగో నగరాన్ని నిర్మిస్తాం

- ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి
- భూమి కోల్పోయిన ప్రజలు అధైర్యపడొద్దు.
- కందుకూరు మీర్‌ఖాన్‌పేట్ వద్ద నెట్‌జీరో సిటీలో ప్రతిపాదిత స్కిల్ యూనివర్సిటీ, అడ్వాన్స్‌డ్ టెక్నాలజీ సెంటర్, మోడ్రన్ స్కూల్, ప్రైమరీ హెల్త్ సెంటర్, కమ్యూనిటీ సెంటర్‌లకు ముఖ్యమంత్రి ఏకకాలంలో శంకుస్థాపన

మిగితా 3వ పేజీలో

# ఎస్సీ వర్గీకరణకు సుప్రీం గ్రీన్ సిగ్నల్

(మొదటి పేజీ తరువాయి)

ప్రధాన పిటిషన్‌తో సహా 23 పిటిషన్లను 2020లో సుప్రీం కోర్టు న్యాయమూర్తులు జస్టిస్ బిఆర్ గవారు, జస్టిస్ విక్రమ్ నాథ్, జస్టిస్ బేలా ఎం. త్రివేది, జస్టిస్ పంకజ్ మిథాల్, జస్టిస్ మనోజ్ మిశ్రాలతో కూడిన ధర్మాసనం విచారించి, ఏడుగురు సభ్యుల రాజ్యాంగ ధర్మాసనానికి రిఫర్ చేసింది. ఎస్సి, ఎస్టి వర్గాలను రాష్ట్రాలు వర్గీకరించలేవని ఈవి చిన్నయ్య వర్సెస్ ఆంధ్రప్రదేశ్‌లో కేసులో 2004లో తీర్పును పున్ణసమీక్షించాలని పేర్కొంది. అప్పుడు ఏడుగురు సభ్యుల రాజ్యాంగ ధర్మాసనం ఈ కేసును విచారించింది.

ఏపి, తెలంగాణలో ఇలా

ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో మాల మాదిగల్లో మాలలే ఎక్కువ అవకాశాలు దక్కించుకుంటున్నారనే ఆరోపణలతో ఎమ్మార్పీఎస్ ఉద్యమం ఆవిర్భవించింది. 2011 నాటికి ఉమ్మడి ఏపిలో 1.34 కోట్ల మంది ఎస్సిల్లో 66 లక్షల మాదిగలు, 54 లక్షలు మాలలు ఉండేవారని ఉద్యోగాల్లో మాత్రం మాదిగలకు తగిన ప్రాధాన్యత దక్కడం లేదనేది ఎంఆర్‌పిఎస్ వాదనగా ఉండేది.

**ఏబీసీడీలులుగా వర్గీకరణ**

1997లో జరిగిన ఎస్‌సి వర్గీకరణలో ఎస్‌సిలను ఏ, బి, సి, డిలుగా వర్గీకరించారు. కేటగిరీ ఏ-లో రెల్లితో పాటు 12 ఉపకులాలకు 1 శాతం, బి కేటగిరీలో మాదిగలతో పాటు 18 కులాలకు 7 శాతం, సి కేటగిరీలో మాలలతో పాటు 25 ఉపకులాలకు 6 శాతం, డి కేటగిరీలో ఆది ఆంధ్రులతో పాటు మరో నాలుగు కులాలకు 1శాతం రిజర్వేషన్ కల్పించారు.

కేంద్ర ప్రభుత్వం తరపున సొలిసిటర్ జనరల్ తుషార్ మెహతా, అడ్వకేట్ కన్ను అగర్వాల్ వాదించారు. పంజాబ్ రాష్ట్రం తరపున అడ్వకేట్ జనరల్ గుర్మిందర్ సింగ్, అడిషనల్ అడ్వకేట్ జనరల్ షాదాన్ ఫరాసత్, అడ్వకేట్ నటాషా మహేశ్వరి వాదించారు. సీనియర్ అడ్వకేట్ శేఖర్ నపేడా, పూర్ణిమా కృష్ణ, ఎంఎఫ్ ఫిలిప్.. తమిళనాడు తరపున వాదనలు వినిపించారు. హర్యానా తరపున సీనియర్ న్యాయవాదిఅరుణ్ భరద్వాజ్ కోర్టుకు హాజరయ్యారు.

సీనియర్ అడ్వకేట్లు గోపాల శంకరనారాయణ, నిదేశ్ గుప్తా, కపిల్ సిబల్, సంజయ్ హెగ్డే, శేఖర్ పడాడే, సల్మాన్ ఖుర్షీద్, విజయ్ హన్సారియ, దామా షేషాద్రి నాయుడు.. ఉప వర్గీకరణకు అనుకూలంగా వాదించారు. సీనియర్ అడ్వకేట్ మనోజ్ స్వరూప్, అడ్వకేట్ సాకేత్ సింగ్.. ప్రతివాదుల తరపున హాజరై.. ఉప వర్గీకరణకు వ్యతిరేకంగా వాదించారు.

మాదిగ రిజర్వేషన్ పోరాట సమతి తరపున సీనియర్ అడ్వకేట్ కేకే వేణుగోపాల్ వర్గీకరణకు అనుకూలంగా వాదించారు. తెలంగాణ ప్రభుత్వం తరపున సీనియర్ న్యాయవాది సిద్ధార్థ లూత్రా హాజరయ్యారు. ఏపీ సర్కారు తరపున డాక్టర్ ఎస్ మురళీధర్ వాదించారు. కార్యకర్త జీఎం గిరి తరపున అడ్వకేట్ శివం సింగ్ వాదించారు.

# కొత్త రేషన్ కార్డుల కోసం సబ్ కమిటీ

(మొదటి పేజీ తరువాయి)

ఇవ్వాలని కేబినెట్‌లో నిర్ణయించారు.

జీహెచ్ఎంసీలో ఔటర్ గ్రామాల విలీనానికి సైతం కేబినెట్ సబ్ కమిటీని ఏర్పాటు చేశారు. జీహెచ్ఎంసీ విలీన కమిటీలో మంత్రులు పొన్నం ప్రభాకర్, సీతక్క, శ్రీధర్ బాబు సభ్యులుగా ఉంటా రు. దీంతో పాటు గౌరవెల్లి ప్రాజెక్ట్ పూర్తి చేయడానికి మంత్రివర్గం ఆమోదం తెలిపింది. గౌరవెల్లి ప్రాజెక్ట్ పెండింగ్ పనుల పూర్తి కోసం రూ.437 కోట్ల విడుదలకు పచ్చజెండా ఊపింది. గౌరవెల్లి ప్రాజెక్టుకు నిధుల కోసం చొరవ తీసుకున్న మంత్రి పొన్నం ప్రభాకర్, కేబినెట్ నిర్ణయంపై హర్షం వ్యక్తం చేశారు.

కొత్త రేషన్ కార్డులకు త్వరలోనే మోక్షం : కొత్త రేషన్ కార్డుల జారీకి సంబంధించిన విధి విధానాల పై మంత్రివర్గంలో సుదీర్ఘంగా చర్చించారు. 6 గ్యారంటీలతో పాటు ఇతర సంక్షేమ పథకాలకు తెల్లరేషన్ కార్డునే ప్రభుత్వం ప్రామాణికంగా తీసుకుంటోంది. ఈ నేపథ్యంలో కొత్త రేషన్ కార్డుల కోసం ప్రజల నుంచి డిమాండ్ ఏర్పడింది. అర్హులం దరికీ తెల్ల రేషన్ కార్డులు ఇవ్వనున్నట్లు పౌర సరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి అసెం బ్లీలో 2 రోజుల క్రితం ప్రకటించారు. ఈ మేరకు రేషన్ కార్డుల జారీకి అర్హతలు, విధి విధానాలపై మంత్రివర్గ సమావేశంలో చర్చించారు. అనంతరం కొత్త రేషన్ కార్డుల కోసం కేబినెట్ సబ్ కమిటీ ఏర్పాటు చేయాలని నిర్ణయించారు.

సమావేశం అనంతరం కేబినెట్ నిర్ణయాలను మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి వెల్లడించారు. 'ఎన్నికల మేనిఫెస్టోలోని అంశాలను తప్పక నెరవేరుస్తాం. త్వరలో పేదలకు తెల్ల రేషన్ కార్డులు ఇచ్చే ప్రక్రియ ప్రారంభిస్తాం. పేదలకు విడివిడిగా తెల్లరేషన్ కార్డులు, ఆరోగ్యశ్రీ కార్డులు ఇస్తాం. రేషన్ కార్డుల జారీ విధి విధానాల కోసం కేబినెట్ సబ్ కమిటీ ఏర్పాటు జరిగింది. క్రీడాకారులు ఈషా సింగ్, నిఖత్ జరీన్, సిరాజ్‌కు 600 గజాల చొప్పున ఇంటి స్థలం ఇవ్వాలని నిర్ణయించాం. విధుల్లో చనిపోయిన రాజీవ్ రతన్ కుమారుడికి మున్సిపల్ కమిషనర్ ఉద్యోగం, మరో అధికారి మురళి కుమారుడికి గ్రూప్- 1 ఉద్యోగం ఇవ్వాలని నిర్ణయించాం' అని వెల్లడించారు.

**గవర్నర్ కోటాలో ఎమ్మెల్సీలుగా కోదండరాం, అమీర్ అలీఖాన్**

అసెంబ్లీ కమిటీ హాల్‌లో మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి మీడియాతో మాట్లాడారు. గవర్నర్ కోటాలో కోదండరాం, అమీర్ అలీఖాన్‌లను ఎమ్మెల్సీలుగా నియమించేందుకు గవర్నర్‌కి రికమండ్ చేయాలని కేబినెట్ నిర్ణయించిందని చెప్పారు. రేపు (శుక్రవారం) అసెంబ్లీలో జాబ్ క్యాలెండర్ ప్రకటిస్తామని చెప్పారు. అర్హులైన వారికి తెల్ల రేషన్ కార్డులు, ఆరోగ్య శ్రీ కార్డులు విడివిడిగా ఇవ్వాలని కేబినెట్ నిర్ణయించిందని చెప్పారు. రేషన్ కార్డుల కోసం మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి అధ్యక్షతన, దామోదర రాజనరసింహా, పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి సభ్యులుగా సబ్ కమిటీ ఏర్పాటు చేశామని వివరించారు.

మరోవైపు రాజీవ్ రతన్ కొడుకు హరీ రతన్‌కు మున్సిపల్ కమిషనర్‌గా ఉద్యోగం ఇవ్వాలని నిర్ణయించిందని పేర్కొన్నారు. మరోవైపు గౌరవెల్లి ప్రాజెక్టు కోసం నిధులు ఇవ్వాలని కేబినెట్ నిర్ణయించిందని చెప్పారు.

# నాలుగో నగరాన్ని నిర్మిస్తాం

- ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి
- భూమి కోల్పోయిన ప్రజలు అధైర్యపడొద్దు
- కందుకూరు మీర్‌ఖాన్‌పేట్ వద్ద నెట్‌జీరో సిటీలో ప్రతిపాదిత స్కిల్ యూనివర్సిటీ, అడ్వాన్స్‌డ్ టెక్నాలజీ సెంటర్, మోడ్రన్ స్కూల్, ప్రైమరీ హెల్త్ సెంటర్, కమ్యూనిటీ సెంటర్‌లకు ముఖ్యమంత్రి ఏకకాలంలో శంకుస్థాపన




**బలగం టీవి, హైదరాబాద్ బ్యూరో**

హైదరాబాద్, సికింద్రాబాద్, సైబరాబాద్‌లకు ధీటుగా ఆధునిక మౌలిక సదుపాయాలతో అత్యాధునికంగా నాలుగో నగరాన్ని నిర్మించి తీరుతామని ముఖ్యమంత్రి ఏ.రేవంత్ రెడ్డి చెప్పారు. ముచ్చర్ల ప్రాంతంలో హెల్త్ టూరిజం హబ్, స్పోర్ట్స్ హబ్, ఎడ్యుకేషన్ హబ్ వంటివాటిని అభివృద్ధి చేయడం, పక్కనే ఆమన్‌గల్ అర్బన్ అడవుల్లో నైట్ సఫారీ పెట్టడం వంటి వాటితో మొత్తంగా ఈ ప్రాంతాన్ని ప్రపంచస్థాయి నగరంగా తీర్చిదిద్దుతామని వివరించారు.కందుకూరు మీర్‌ఖాన్‌పేట్ వద్ద నెట్‌జీరో సిటీలో ప్రతిపాదిత స్కిల్ యూనివర్సిటీతో పాటు అడ్వాన్స్‌డ్ టెక్నాలజీ సెంటర్, మోడ్రన్ స్కూల్, ప్రైమరీ హెల్త్ సెంటర్, కమ్యూనిటీ సెంటర్‌లకు ముఖ్యమంత్రి ఏకకాలంలో శంకుస్థాపన చేశారు. అనంతరం స్థానికంగా ఏర్పాటు చేసిన సభలో ప్రసంగిస్తూ నాలుగో నగర నిర్మాణం కోసం చేపట్టే కార్యక్రమాలు, దాని ప్రాముఖ్యతను వివరించారు.

"ఈ ప్రాంతంలో భూమి కోల్పోయిన ప్రజలు అధైర్యపడొద్దు. వారందరినీ ప్రభుత్వం ఆదుకుంటుంది. ఆ కుటుంబాల్లో పిల్లలకు నైపుణ్య శిక్షణ ఇచ్చి ఉద్యోగాలు కల్పిస్తుంది. ఈ ప్రాంత ప్రజల భవిష్యత్తు కోసం ప్రభుత్వం ప్రణాళికలు వేస్తోంది. ఈ ప్రాంతం ఫ్యూచర్ సిటీగా మారబోతుంది. న్యూయార్క్ నగరం కంటే అధునాతన నగరాన్ని ఇక్కడ నిర్మించడం.ఎల్బీనగర్ నుంచి ఎయిర్‌పోర్ట్ వరకు మెట్రో రైలును విస్తరించడం, ఆ తర్వాత దాన్ని నెట్ జీరో సిటీ వరకు పొడగించడం. ఆ ప్రాంతం వరకు 200 అడుగులతో రోడ్డు మార్గాన్ని నిర్మించడం. వచ్చే మూడు నెలల్లో రీజినల్ రింగ్ రోడ్డు పనులకు శ్రీకారం చుట్టడం. స్కిల్ యూనివర్సిటీలో అడ్మిషన్ లభించిందంటే కచ్చితంగా ఉద్యోగం లభించే ప్రణాళికలు.నాలుగో నగరంగా ఏర్పడటానికి కీలకమైన విద్య, వైద్యం, ఇతర మౌళిక సదుపాయాలను కల్పించి ముచ్చర్లను ఫ్యూచర్ సిటీగా మార్చడం." అని తెలిపారు.

# ప్రత్యేక అధికారులు గ్రామాల్లో పర్యటించాలి



- కలెక్టర్ సందీప్ కుమార్ ఝా

**బలగం టీవీ , సిరిసిల్ల :**

ప్రత్యేక అధికారులు వారికి కేటాయించిన గ్రామాల్లో పర్యటించాలని, నిత్యం పనులను పర్యవేక్షించాలని కలెక్టర్ సందీప్ కుమార్ ఝా ఆదేశించారు. గురువారం జిల్లా సమీకృత కార్యాలయాల సముదాయం లోని కాన్ఫరెన్స్ హాలులో ఆయా శాఖల ఉన్నతాధికారులతో కలెక్టర్ సందీప్ కుమార్ ఝా సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సందీప్ కుమార్ ఝా మాట్లాడాతూ ప్రత్యేక అధికారులు క్రమం తప్పకుండా గ్రామాల్లో పర్యటించాలని ఆదేశించారు. ప్రతి శుక్రవారం డ్రై డే గా పాటించాలని, ప్రతి ఇంటి నుంచి తడి, పొడి చెత్త వేరు చేసి ఇచ్చేలా అవగాహన కల్పించాలని అన్నారు . వన మహోత్సవం లో భాగంగా మొక్కలు నాటి సంరక్షించాలని, ఆయా శాఖలకు కేటాయించిన లక్ష్యాన్ని చేరుకోవాలని, అన్ని శాఖల అధికారులు తమ కార్యాలయాలు శుభ్రంగా ఉంచేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో నీటిని కచ్చితంగా క్లోరినేషన్ చేయించాలని, నీరు నిలువ ఉండకుండా చూసుకోవాలని అన్నారు.

ఈ కార్యక్రమం లో జడ్పీ సీఈవో ఉమారాణి, సిరిసిల్ల, వేములవాడ ఆర్డీవో లు రమేష్, రాజేశ్వర్, డీ ఆర్డీఓ శేషాద్రి, జిల్లా పశుసంవర్ధక శాఖ అధికారి రవీందర్ రెడ్డి, డీపీఓ వీర బుచ్చయ్య, జిల్లా వైద్యాధికారి వసంత రావు, సిరిసిల్ల, వేములవాడ మున్సిపల్ కమిషనర్లు లావణ్య, అన్వేష్, ఎస్డీసీ రాధాభాయ్, ఎస్సీ సంక్షేమ అధికారి విజయలక్ష్మి, జిల్లా వెటర్నరీ అధికారి, డీఏఓ భాస్కర్, మిషన్ భగీరథ ఈఈలు విజయ్ కుమార్, జానకి, ఆయా శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# 15 మంది చిన్నారులపై వీధి కుక్కల దాడి

**బలగం టీవీ , హైదరాబాద్**



వీధి కుక్క స్వైర విహారం చేస్తూ రోడ్డు పై 15 మంది చిన్నారులపై దాడి చేసిన ఘటన హైదరాబాద్ బాలనగర్‌లో చోటుచేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. గురువారం బాలానగర్‌లోనినడుచుకుంటూ వెళ్తున్న ఓ బాలుడి పై కుక్క దాడి చేసింది. గమనించిన స్థానికులు అతన్ని కాపాడి ఆస్పత్రికి తరలించారు. ఇదిలా ఉండగా కాసేపటికి సాయి నగర్, వినాయక్ నగర్, రాజు కాలనీలలో కుక్కలు మరో 14 మంది చిన్నారులపై దాడులకు పాల్పడ్డాయి. దాడులకు గురైన వారిలో ఏడాదిన్నర వయస్సు నుంచి 16 ఏండ్ల వయస్సు చిన్నారులు ఉన్నారు వారిని చికిత్స నిమిత్తం స్థానిక ఆస్పత్రికి తరలించారు. కాలనీ వాసుల ఫిర్యాదుతో డాగ్‌స్క్వాడ్ సిబ్బంది దాదాపు శ్రమించి కుక్కలను పట్టుకున్నారు.

# వయనాడ్‌లో ఎంపీ రాహుల్ పర్యటన



(మొదటి పేజీ తరువాయి)

కలసి ఆయన వయనాడ్‌లోని ప్రకృతి బీభత్సానికి గురైన ప్రాతాలను సందర్శించారు. ఇది వయనాడ్‌కు, కేరళకు, యావద్ దేశానికే ఘోర దుర్ఘటనని ఆయన పేర్కొన్నారు.తన దృష్టిలో ఇది జాతీయ విపత్తని, అయితే ప్రభుత్వం ఏ విధంగా స్పందిస్తుందో వేచి చూడాలని విలేకరులతో మాట్లాడుతూ ఆయన చెప్పారు. వయనాడ్‌లోని చూల్‌మల ప్రాంతాన్ని ఆయన సందర్శించారు. ఇక్కడి పరిస్థితిని ప్రత్యక్షంగా చూసేందుకే తాము వచ్చామని, ప్రజలు తమ కుటుంబ సభ్యులను, ఇళ్లను కోల్పోవడం చాలా విచారకరమని రాహుల్ అన్నారు. బాధితులను ఎలా ఓదార్చాలో తనకు అర్థం కావడం లేదని, ఈ పరిస్థితిలో వారిని పలకరించడం కూడా చాలా కష్టమని ఆయన తెలిపారు. ఇది తనకు అత్యంత కష్టమైన రోజని, ఈ విపత్తు నుంచి ప్రాణాలతో బయటపడినవారిని ఆదుకోవడానికి తన వంతు కృషి తాను చేస్తున్నానని ఆయన తెలిపారు. ప్రియాంక గాంధీ మాట్లాడుతూ ఇక్కడి ప్రజలకు వచ్చిన కష్టం ఎవరూ ఊహించనిదని అన్నారు. వారిని ఆదుకుని వారికి అండగా నలిబడడేందుకు ప్రయత్నిస్తున్నామని ఆమె చెప్పారు.మేప్పాడిలోని ఆసుపత్రిని, కమ్యూనిటీ హెల్త్ సెంర్‌ను, రెండు సహాయ శిబిరాలను రాహుల్, ప్రియాంక సందర్శించారు. ఈ కష్టకాలంలో వయనాడ్ ప్రజలకు అండగా తాను, ప్రియాంక నిలబడతామని, సహాయ, రక్షణ, పునరావాస కార్యక్రమాలను పర్యవేక్షిస్తున్నామని, బాధితులకు అవసరమైన సహాయాన్ని అందచేస్తున్నామని రాహుల్ తెలిపారు. బాధితులకు అండగా యుడిఎఫ్ నిలబడుతుందని ఆయన చెప్పారు. వరుసగా జరుగుతున్న కొండ చరియలు విరిగిపడిన ఘటనలు, ప్రకృతి విపత్తులు చాలా ఆందోళన కలిగిస్తున్నాయని, ఇందుకు సమగ్ర కార్యాచరణ ప్రణాళిక తక్షణ అవసరమని ఎక్స్ పోస్టులో రాహుల్ పేర్కొన్నారు. చూరల్‌మలను చేరుకున్న అనంతరం రాహుల్, ప్రియాంక రెయిన్‌కోట్లు ధరించి తాత్కాలికంగా నిర్మించిన చెక్క వంతెనపై నుంచి నడిచి కొత్తగా నిర్మిస్తున్న బెయిలీ వంతెనను తిలకించారు.

బురదతో నిండిపోయిన ఆ ప్రాంతాన్ని పరిశీలించారు. అనంతరం మేప్పాడిలోని డాక్టర్ మూపెన్స్ మెడికల్ కాలేజ్, కమ్యూనిటీ హెల్త్ సెంటర్‌ను సందర్శించి అక్కడ రిశీతల పేటికలలో భద్రపరిచిన మృతదేహాలను సందర్శించి బాధిత కుటుంబాలను పరామర్శించారు. వారి వెంట అళప్పుళ ఎంపి, ఏఐసిసి ప్రధాన కార్యదర్శి కెసి వేణుగోపాల్, ఇతర కాంగ్రెస్ నాయకులు ఉన్నారు. 2019లో వయనాడ్ పార్లమెంట్ నియోజకవర్గం నుంచి గెలుపొందిన రాహుల్ 2024 ఎన్నికలలో కూడా ఇక్కడి నుంచి గెలుపొందారు. అయితే రెండు స్థానాలలో పోటీ చేసిన రాహుల్ రాయ్‌బరేలి స్థానాన్ని ఉంచుకుని వయనాడ్ స్థానానికి రాజీనామా చేశారు.

# తెలంగాణలో రెండురోజులు భారీ వానలు



**బలగం టీవి, హైదరాబాద్ బ్యూరో**

తెలంగాణలో మరో రెండురోజుల పాటు భారీ వర్షాలు కురిసే ఛాన్స్ ఉందని వాతావరణ కేంద్రం తెలిపింది. రాగల మూడురోజులు స్థిరమైన ఉపరితల గాలులు గంటకు 30 నుంచి 40 కిలోమీటర్ల వేగంతో పలు జిల్లాల్లో వీస్తాయని పేర్కొంది. అలాగే శుక్రవారం వరకు జయశంకర్ భూపాలపల్లి, ములుగు, భద్రాద్రి కొత్తగూడెం, ఖమ్మం, వరంగల్, హన్మకొండ జిల్లాల్లో అక్కడక్కడ భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని తెలిపింది. ఆదిలాబాద్, ఆసిఫాబాద్, మంచిర్యాల, నిజామాబాద్, జగిత్యాల, రాజన్న సిరిసిల్ల, కరీంనగర్, పెద్దపల్లి, మహబూబాబాద్, హన్మకొండ, జనగాం, సిద్దిపేట, హైదరాబాద్, మేడ్చల్ మల్కాజగిరి, వికారాబాద్, సంగారెడ్డి, మెదక్, కామారెడ్డి, వనపర్తి, నారాయణపేట, జోగులాంబ గద్వాల జిల్లాల్లో అక్కడక్కడ ఉరుములు, మెరుపులు, ఈదురుగాలులతో కూడిన వానలు పడే అవకాశం ఉందని పేర్కొంది.

శుక్రవారం నుంచి శనివారం ఉదయం వరకు ఆదిలాబాద్, కుమ్రంభీం ఆసిఫాబాద్, మంచిర్యాల, నిర్మల్, నిజామాబాద్, కరీంనగర్, కొత్తగూడెం, ఖమ్మం, వరంగల్, హన్మకొండ, మెదక్, కామారెడ్డి, నాగర్ కర్నూల్, వనపర్తి, జోగులాంబ గద్వాల జిల్లాల్లో అక్కడక మోస్తరు వర్షాలు కురిసే ఛాన్స్ ఉందని తెలిపింది. ఈ మేరకు ఆయా జిల్లాలకు వాతావరణశాఖ ఎల్లో అలెర్ట్‌ను జారీ చేసింది. ఇదిలా ఉండగా.. గడిచిన 24గంటల్లో నిజామాబాద్, జగితాల్య, ఆదిలాబాద్, వనపర్తి, సిరిసిల్ల, సూర్యాపేట, ములుగుతో పాటు పలు జిల్లాల్లో మోస్తరు వర్షాపాతం నమోదైందని టీజీ డీపీఎస్ వివరించింది.

# బీఆర్ఎస్ ఎమ్మెల్యేల అరెస్ట్..



(మొదటి పేజీ తరువాయి)

సబితా ఇంద్రారెడ్డి, కోవ లక్ష్మి, సునీతా లక్ష్మారెడ్డి నిరసన తెలిపారు. సీఎం క్షమాపణలు చెప్పే వరకు నిరసన కొనసాగిస్తామని బీఆర్ఎస్ మహిళా ఎమ్మెల్యే స్పష్టం చేశారు.

ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, డిప్యూటీ సీఎం భట్టివిక్రమార్కల వ్యాఖ్యలకు నిరసనగా బీఆర్ఎస్ శాసనసభ్యులు నల్లబ్యాడ్జీలు ధరించి సభకు హాజర య్యారు. మహిళా ఎమ్మెల్యేలకు సీఎం, డిప్యూటీ ఎంసీ వెంటనే క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. సభలో నినాదాలతో హెూరెత్తించారు. బీఆర్ఎస్ ఎమ్మెల్యేల నిరసనల మధ్యే మంత్రి శ్రీధర్ బాబు స్కిల్ యూనివర్సిటీ బిల్లును సభలో ప్రవేశపెట్టారు. అయితే తమకు మాట్లా డేందుకు అవకాశం ఇవ్వాలని ఎమ్మెల్యేలు పట్టుబట్టారు.

కాగా, నిండు శాసనసభలో సీఎం రేవంత్ రెడ్డి, డిప్యూటీ సీఎం భట్టివిక్ర మార్క మహిళల పట్ల అత్యంత అవమా నకరంగా ప్రవర్తించారని, వారి ప్రవర్తన తనను ఆశ్చర్యానికి గురిచేసిందని కేటీఆర్ అన్నారు. ఎమ్మెల్యేలు సబితా ఇంద్రారెడ్డి, సునీతా లక్ష్మారెడ్డికి ముఖ్యమంత్రి, డిప్యూటీ సీఎంలు బేషరతుగా క్షమాపణలు చెప్పాలని డిమాండ్ చేశారు. మహిళ నేతలను ఇంత చులకనగా మాట్లాడటం సిగ్గు చేటని విమర్శించారు. కాంగ్రెస్ నాయకులు చేసిన ఈ వ్యాఖ్యలు వారిద్దరిపై మాత్రమే కాదు మొత్తం మహిళలపై వారికున్నా చులకన భావాన్ని తెలియజేస్తుందన్నారు. కాంగ్రెస్ నేతల వ్యవహార శైలిని మహిళలంతా గమనిస్తున్నారని చెప్పారు. వారికి సరైన సమయంలో బుద్ధి చెప్పడం ఖాయమన్నారు.

# 48 గంటల్లో 4 లైంగికదాడులా..?

- మాజీ మంత్రి కేటీఆర్



**బలగం టీవి, హైదరాబాద్ బ్యూరో**

రాష్ట్రంలో ఇటీవల మహిళలపై జరుగుతున్న లైంగిక వేధింపులు తీవ్ర ఆందోళన కలిగిస్తున్నాయని మాజీ మంత్రి కేటీఆర్ ఎక్స్ వేదికగా ఆందోళన వ్యక్తం చేశారు. కేవలం 48 గంటల్లోనే సామూహిక లైంగికదాడులు, దాడులు సహా నాలుగు దారుణ ఘటనలు చోటుచేసుకోవడం సిగ్గు చేటని ఆవేదన చెందారు. ఈ క్రూరమైన చర్యలతో మహిళలకు భద్రత లేదని అర్థమవుతుందని అన్నారు. రాష్ట్రంలో శాంతిభద్రతలు క్షీణిస్తున్న పరిస్థితిని ఎత్తిచూపుతున్నాయని తెలిపారు. ఎనిమిది నెలలు గడిచినా రాష్ట్రానికి హెూంమంత్రి లేకపోవడం ఏంటని ప్రశ్నించారు. ఈ ప్రభావం నేరాలు పెరగడానికి ప్రత్యక్ష నిదర్శనమని విమర్శించారు. వనస్థలిపురం, శాలిగౌరారం, నిర్మల్, పుప్పాలగూడలో జరిగిన దారుణ ఘటనలపై తక్షణ చర్యలు తీసుకోవాలని కోరారు. దోషులను కఠినంగా శిక్షించాలని, మహిళల భద్రతకు ప్రభుత్వం తక్షణమే చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.



# ఆర్థిక సహాయం అందజేత

**బలగం టీవీ ,తంగళ్ళపల్లి**

రాజన్న సిరిసిల్ల జిల్లా తంగళ్ళపల్లి మండలం మండెపల్లి గ్రామంలోని గ్రామపంచాయతీ కార్మికుడు నక్క బాలరాజు అనారోగ్యంతో మృతిచెందగా వారి కుటుంబానికి ఆర్థిక సాహయం గ్రామపంచాయతీ నుండి 10000 రూపాయల ఆర్థిక సహాయంగా గ్రామ పంచాయతీ కార్యదర్శి ప్రశాంత్, కారోబార్ లచ్చిరెడ్డి గ్రామ పంచాయతీ కార్మికులు అందజేశారు.



# ఎమ్మెల్యేలకు బుజ్జగింపులు..!

- పోచారం ఇంటికి సీఎం రేవంత్
- ఎమ్మెల్యే కృష్ణమోహన్‌రెడ్డి ఇంటికి మంత్రి జూపల్లి

**బలగం టీవి, హైదరాబాద్ బ్యూరో**

కాంగ్రెస్‌లో చేరిన ఎమ్మెల్యేలు చేజారకుండా ఉండేందుకు అధికార పార్టీ బుజ్జగించే పనిలోపడింది. సీఎం రేవంత్‌రెడ్డి బుధవారం రాత్రి మాజీ స్పీకర్ పోచారం శ్రీనివాస్‌రెడ్డి ఇంటికి వెళ్లారు. ఆయనతోపాటు కాంగ్రెస్ వ్యవహారాల ఇన్‌చార్జి దీపాదాస్ మున్షీ, ప్రభుత్వ సలహాదారు వేం నరేందర్‌రెడ్డి కూడా వెళ్లినట్టు విశ్వసనీయ వర్గాలు తెలిపాయి.

బీఆర్ఎస్ నుంచి కాంగ్రెస్‌లో చేరిన ఎమ్మెల్యేలతో వారు భేటీ అయినట్టు తెలుస్తున్నది. ఈ సమావేశానికి బండ్ల కృష్ణమోహన్‌రెడ్డి మినహా మిగతా ఎమ్మెల్యేలంతా హాజరైనట్టు తెలిసింది. కాంగ్రెస్‌లో చేరే వరకు తమతో సంప్రదింపులు జరిపి, ఆ తర్వాత తమను గాలికి వదిలేశారని పార్టీ మారిన ఎమ్మెల్యేలు అసంతృప్తిలో ఉన్నట్టు ప్రచారం జరుగుతున్నది.కాంగ్రెస్ నుంచి గెలిచిన ఎమ్మెల్యేలకే మంత్రి పదవులు అని సీఎం స్పష్టంగా చెప్పడంతో మి గతా ఎమ్మెల్యేల ఆశలు ఆవిరయ్యాయి. మరోవైపు తమను రాష్ట్ర, స్థానిక కాంగ్రెస్ నేతలు, ఇతర ఎమ్మెల్యేలు కలుపుకోవడం లేదంటూ వారు అసంతృప్తిలో ఉన్నారని తెలుస్తున్నది. అందుకే వారు అసెంబ్లీలో కూడా అంటీముట్టనట్టు వ్యవహరిస్తున్నారని, ఒంటరిగా వచ్చిపోతున్నారని చెప్తున్నారు.

రెండు రోజుల కిందట అసెంబ్లీలో కేటీఆర్‌ను కలిసి.. తాను బీఆర్ఎస్‌లోనే కొనసాగుతానని బండ్ల చెప్పిన సంగతి తెలిసిందే. దీంతో ఏం జరుగుతున్నదంటూ అధిష్ఠానం ఆరా తీయడంతో రేవంత్‌రెడ్డి అప్రమత్తమైనట్టు చెప్తున్నారు. దీపాదాస్ మున్షీ రం గంలోకి దిగి, సీఎంతో కలిసి పోచారం ఇంటికి వెళ్లి బుజ్జగింపులు జరిపినట్టు సమాచారం. అలాగే గద్వాల ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్‌రెడ్డి ఇంటికి మంత్రి జూపల్లి కృష్ణారావు వెళ్లారు. ఆయన తిరిగి బీ ఆర్ఎస్ వెళ్తారనే ప్రచారం జోరుగా సాగుతున్న నేపథ్యంలో బుజ్జగించేందుకు ఆయన నివాసానికి వెళ్లినట్లు తెలుస్తున్నది. అసెంబ్లీ ఎన్నికల్లో కృష్ణమోహన్‌రెడ్డి గద్వాల నియోజకవర్గం నుంచి బీఆర్ఎస్ అభ్యర్థిగా పోటీ చేసి గెలుపొందారు. అనంతరం అయన ముఖ్యమంత్రి సమక్షంలో కాంగ్రెస్‌లో చేరారు. అయితే రెండు రోజుల క్రితం బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌తో అసెంబ్లీలో భేటీఅయ్యారు. తాను బీఆర్ఎస్‌లోనే కొనసాగుతానని బండ్ల చెప్పిన సంగతి తెలిసిందే.

# ఏసీబీకి పట్టుబడ్డ ధరణి ఆపరేటర్, జూనియర్ అసిస్టెంట్

**బలగం టీవీ , హైదరాబాద్**

అమీన్‌పూర్ మండలం ఎమ్మార్వో కార్యాలయానికి చెందిన ఇద్దరు ఉద్యోగులు లంచం తీసుకుంటూ గురువారం రెడ్ హ్యాండెడ్ గా ఏసీబీకి పట్టుబడ్డారు. మండల కార్యాలయంలో ధరణి ఆపరేటర్‌గా పనిచేస్తున్న చాకలి అరుణ్‌కుమార్, జూనియర్ అసిస్టెంట్ గా పనిచేస్తున్న మన్నె సంతోష్ బాధితుడు వెంకటేశం యాదవ్ నుంచి రూ. 30 వేల లంచం తీసుకుంటూ ఏసీబీ అధికారులకు పట్టుబడ్డారు.బండ్లగూడకు చెందిన వెంకటేశం యాదవ్ అత్తగారి ఆస్తికి సంబంధించిన ఫైలుపై సంతకాలు చేసేందుకు ఉద్యోగులు లంచం డిమాండ్ చేశారు. దీంతో బాధితుడు ఏసీబీ అధికారులను ఆశ్రయించాడు. తీసుకున్న లంచం డబ్బును ఆపరేటర్ చాకలి అరుణ్‌కుమార్ కారులో దాచుకోగా కారును తనిఖీ చేసి సొమ్మును స్వాధీనం చేసుకున్నారు.

# ఒలింపిక్స్‌లో భారత్‌కు మరో పతకం

- కాంస్యం గెలుచుకున్న యువ షూటర్ స్విప్నిల్ కుశల్




బలగం టీవీ, స్పోర్ట్స్ బ్యూరో

ఒలింపిక్స్‌లో భారత్‌కు మరో పతకం గెలుచుకుంది. షూటర్ స్విప్నిల్ కుశల్ 50 మీటర్ల మెన్స్ 3 పొజిషన్ షూటింగ్‌లో మూడో స్థానంలో నిలిచారు. దీంతో స్వప్నిల్‌కు కాంస్యం వరించింది. బుధవారం జరిగిన క్వాలిఫికేషన్ రౌండ్‌లో 590 పాయింట్లు సాధించిన స్వప్నిల్.. ఏడవ స్థానంలో నిలిచిన విషయం తెలిసిందే. ఎక్కువ సంఖ్యలో పది పాయింట్లు కొట్టిన నేపథ్యంలో స్వప్నిల్‌కు ఫైనల్ అర్హత సాధించాడు. ఇక గురువారం ఫైనల్‌లోనూ సత్తాచాటాడు. 451.4 పాయింట్లతో స్వప్నిల్ మూడోస్థానంలో నిలిచి కాంస్య పతకాన్ని ముద్దాడాడు. దీంతో ప్రస్తుతం ఒలింపిక్స్‌లో భారత పతకాల సంఖ్య మూడుకు చేరింది.

# లెన్స్, ఇయర్ ప్రొటెక్టర్స్ లేకుండానే షూటింగ్




- పతకం సాధించిన టర్కీ షూటర్

బలగం టీవీ, స్పోర్ట్స్ బ్యూరో

ఒలింపిక్స్ షూటింగ్ ఈవెంట్‌లో పాల్గొనే షూటర్లు టార్గెట్ మిస్ అవ్వకుండా ఉండేందుకు కళ్లకు లెన్స్? అండ్ ఇయర్ ప్రొటెక్టర్స్ ధరిస్తారు. అయితే పారిస్ ఒలింపిక్స్‌లో ఓ టర్కీ షూటర్ ఇవేమీ వాడకుండానే ఈవెంట్‌లో పాల్గొని సిల్వర్ మెడల్ సాధించాడు. అది కూడా 51ఏళ్ల వయసులో...

టర్కీకి చెందిన 51ఏళ్ల యూసుఫ్ డికేస్ పారిస్ ఒలింపిక్స్ 10మీటర్ల ఎయిర్ రైఫిల్ ఈవెంట్ మిక్స్‌డ్ ఫైనల్‌కు చేరుకున్నాడు. ఈ ఈవెంట్‌లో యూసుఫ్ ఎలాంటి ఎక్విప్‌మెంట్ ధరించకుండా సింపుల్‌గా కనిపించాడు. అతడు తన రెగ్యులర్ కళ్లజోడుతో పాకెట్‌లో చేయి ఉంచి అలవోకగా పిస్టల్ పేల్చాడు. కాగా, యూసుఫ్- తర్హాన్ జోడీ ఈ ఈవెంట్‌లో రెండో స్థానం దక్కించుకొని సిల్వర్ మెడల్ అందుకుంది. ఎలాంటి ఎక్విప్‌మెంట్ సహాయం లేకుండా సిల్వర్ నెగ్గిన యూసుఫ్‌పై సోషల్ మీడియాలో ప్రశంసలు కురుస్తున్నాయి. 'అయితే జులై 30న ఈ పోటీ జరగ్గా, తాజాగా వీడియో వైరల్ అవుతోంది. కాగా, ఈ ఈవెంట్‌లో సెర్బియా జోడీ జొరానా- దామిర్ అగ్రస్థానం దక్కించుకొని గోల్డ్ మెడల్ అందుకుంది.

# బెల్జియం చేతిలో భారత్ ఓటమి



బలగం టీవీ, స్పోర్ట్స్ బ్యూరో

పారిస్ ఒలింపిక్స్ హాకీలో డిఫెండింగ్ ఛాంపియన్ బెల్జియం చేతిలో భారత్ ఓటమి పాలైంది. 2-1 తేడాతో బెల్జియం విక్టరీ కొట్టింది. ఆరంభంలో ఇండియానే ఆధిక్యంలో ఉన్నా.. టోక్యో మెడలిస్ట్ బెల్జియం అద్భుతమైన ఆట తీరును ప్రదర్శించింది. భారత్ తరపున అభిషేక్ ఒక్కడే గోల్ చేశాడు. తొలి రెండు క్వార్టర్లలో భారత్ దూకుడు ప్రదర్శించినా.. కీలకమైన చివరి రెండు క్వార్టర్స్‌లో బెల్జియం ఆటగాళ్లు జోరు పెంచారు. రాజ్ కుమార్ పాల్‌కు ఎల్లో కార్డు ఇవ్వడం వల్ల.. చివరి నిమిషాల్లో ఒక ఆటగాడు లేకుండానే ఇండియా ఆడాల్సి వచ్చింది. ఇక ఇది భారత్‌కు ఈ ఒలంపిక్స్‌లో తొలి ఓటమి

# బాక్సర్ నిఖత్ జరీన్‌కు నిరాశ



బలగం టీవీ, స్పోర్ట్స్ బ్యూరో

బాక్సర్ నిఖత్ జరీన్ పారిస్ ఒలింపిక్స్ నుంచి నిమిష్క్రమించింది. 50 కేజీల విభాగంలో పోటీపడ్డ నిఖత్ జరీన్.. ఆసియా స్వర్ణ పతక విజేత, చైనాకు చెందిన వూ యూ చేతిలో 5-0 తేడాతో ఓటమిపాలైంది. ప్రీ క్వార్టర్స్‌లో 5-0 తేడాతో నిఖత్ బాక్సింగ్ బౌట్‌ను కోల్పోయింది.

పారిస్ ఒలింపిక్స్‌లో అన్‌సీడెడ్‌గా నిఖత్ పోటీలో దిగింది. తన రేంజ్‌ను అందుకోవడంలో ఆమె ఇబ్బంది పడింది. నిఖత్ పంచ్‌లు వెలవెల బోయాయి. 52 కిలోల ఫ్లయ్‌వెయిట్‌లోనూ ప్రపంచ చాంపియన్ అయిన చైనా క్రీడాకారిణి.. బౌట్ మొత్తం ఆధిపత్యాన్ని ప్రదర్శించింది. మెగా గేమ్స్‌లో మెడల్ సాధిస్తుందని అనుకున్నా.. నిఖత్‌కు రెండో రౌండ్‌లోనే బలమైన ప్రత్యర్థిని ఎదుర్కోవాల్సి వచ్చింది. తొలి రౌండ్‌లో జర్మనీ బాక్సర్ మాక్సీ కరీనా కోయిజర్‌పై నిఖత్ గెలుపొందింది.

## క్వార్టర్స్‌లోకి లక్ష్య సేన్..

బలగం టీవీ, స్పోర్ట్స్ బ్యూరో

ఒలింపిక్స్‌లో భాగంగా బ్యాడ్మింటన్ పురుషుల సింగిల్స్‌లో లక్ష్యసేన్ క్వార్టర్స్‌లోకి ప్రవేశించాడు. గురువారం జరిగిన రౌండ్ ఆఫ్ 16 మ్యాచ్‌లో వరుస సెట్లలో విజయం సాధించి లక్ష్య సేన్ క్వార్టర్ ఫైనల్‌కు చేరుకున్నాడు. ఈ మ్యాచ్‌లో భారత స్టార్ ప్లేయర్లు హెచ్ఎస్ ప్రణయ్, లక్ష్యసేన్ తలపడ్డారు. కాగా, ఈ మ్యాచ్‌లో లక్ష్యసేన్ 21-12, 21-6తో హెచ్ఎస్ ప్రణయ్‌పై వరుస సెట్లలో విజయం సాధించాడు. ఇక, క్వార్టర్‌ఫైనల్‌లో లక్ష్య సేన్ చైనీస్ తైపీకి చెందిన 12వ సీడ్ చౌ టియెన్ చెన్‌తో తలపడనున్నాడు.





## పీవీ సింధు ఓటమి

బలగం టీవీ, స్పోర్ట్స్ బ్యూరో


పారిస్ ఒలింపిక్స్‌లో భాగంగా గురువారం మహిళల సింగిల్స్ ఈవెంట్‌లో భారత స్టార్ షట్లర్ సింధు కు నిరాశే ఎదురైంది. ప్రిక్వార్టర్స్ 16వ రౌండ్‌లో చైనా క్రీడాకారిణి హెబింగ్జియావోతో తలపడిన సింధు వరుస సెట్లలో 19-21, 14-21 పాయింట్ల తేడాతో ఓటమిపాలైంది..



## రూ.100కే కల్కి టికెట్..

బలగం టీవీ, సినిమా బ్యూరో


రెబల్ స్టార్ ప్రభాస్ హీరోగా నాగ్ అశ్విన్ దర్శకత్వంలో తెరకెక్కిన బ్లాక్ బస్టర్ మూవీ కల్కి 2898 జూన్ 27న ప్రపంచవ్యాప్తంగా ప్రేక్షకుల ముందుకు వచ్చిన ఈ సినిమా థియేటర్లలో కలెక్షన్ల సునామీ సృష్టించింది. దాదాపు 1100 కోట్లకు పైగా వసూలు చేసినట్లు చిత్ర బృందం అధికారికంగా ప్రకటించింది. కాగా, తాజాగా చిత్ర యూనిట్ ఓ అద్భుతమైన ఆఫర్ తీసుకొచ్చింది. దేశ వ్యాప్తంగా అన్ని థియేటర్లలో కల్కి మూవీని రూ.100 కే చూడొచ్చునని ప్రకటించింది. ఇక ఈ ఆఫర్ ఆగస్టు 2 నుంచి 9 వరకు మాత్రమే వర్తించనున్నట్లు సోషల్ మీడియా వేదికగా వెల్లడించింది.




## అశ్విన్‌బాబు న్యూలుక్ విడుదల

బలగం టీవీ, సినిమా బ్యూరో

అశ్విన్ బాబు హీరోగా ఓ ప్రాజెక్టు తెరకెక్కుతోంది. మెడికో థ్రిల్లర్‌గా రాబోతున్న ఈ చిత్రానికి మామిడాల ఎం.ఆర్. కృష్ణ దర్శకత్వం వహిస్తున్నారు. అరుణశ్రీ ఎంటర్టైన్మెంట్స్ ప్రొడక్షన్ నెంబర్ 3గా ఈ చిత్రాన్ని నిర్మిస్తోంది. నిర్మాత టి. గణపతి రెడ్డి నిర్మిస్తున్నారు. ఆగష్టు 1, అశ్విన్ బాబు పుట్టిన రోజు సందర్భంగా, చిత్ర యూనిట్ అశ్విన్ బాబుకి పుట్టిన రోజు శుభాకాంక్షలు తెలియజేస్తూ తాజాగా ఓ స్పెషల్ పోస్టర్ రిలీజ్ చేసింది. ఈ చిత్రంలో అశ్విన్ బాబుకి జోడిగా రియా సుమన్ నటిస్తున్నారు. అయేషా ఖాన్, మురళీ శర్మ, సచిన్ ఖేడేకర్, అజరు, గణేష్, యెష్నా చౌదరి, సుదర్శన్, శకలక శంకర్, రాఘవ కీలక పాత్రలు పోషిస్తున్నారు. ప్రస్తుతం ఈ చిత్రం హైదరాబాద్, వైజాగ్, కొడరు కేనాల్ ల్లో 75 శాతం షఉటింగ్ పూర్తి చేసుకుంది. ఈ సంవత్సరం చివరిలో ప్రేక్షకులు ముందుకి రాబోతుంది. ఈ సినిమాకి టాప్ టెక్నిషియన్స్ పని చేస్తున్నారు. గౌర హరి మ్యూజిక్ అందిస్తున్నారు.




## 'కోలివుడ్' సాయం

బలగం టీవీ, సినిమా బ్యూరో

కేరళలో భారీ వర్షాలు, కొండచరియలు విరిగిపడిన కారణంగా నష్టపోయిన వారికి కోలివుడ్ హీరోలు అండగా నిలిచారు. కోలీవుడ్ హీరోలు విక్రమ్, సూర్య తమ వంతు సాయం అందించడానికి ముందుకొచ్చారు. ఇప్పటికే ఇతర తమిళ నటులు తమ వంతు సాయాన్ని ప్రకటించారు.నటుడు విక్రమ్ కేరళ ముఖ్యమంత్రి సహాయ నిధికి రూ. 20 లక్షలు అందించగా, సూర్య, జ్యోతి దంపతులు రూ. 50 లక్షలు కేరళ ముఖ్యమంత్రి సహాయ నిధికి అందించారు. బాధితులు త్వరగా కోలుకోవాలని నటుడు విజయ్ ఆశించారు.